మిషన్ భగీరథ సర్వేను విజయవంతం చేయాలి

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు రూరల్, జూన్ 7 : ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ సర్వేను అధికారులు విజయవంతం చేయాలని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ ఎస్ఈ శ్రీనివాసరావుతో కలిసి సర్వే మొబైల్ అప్లికేషన్‌పై అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఇంటికీ తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం సర్వేను చేపట్టిందన్నారు. అధికారులు గ్రామాల్లో తిరుగుతూ నల్లా కనెక్షన్ ఉన్నది? లేనిది? నమోదు చేసుకొని సరిపడినంత నీరు సరఫరా అవుతుందా? అనేది తెలుసుకోవాలన్నారు. నల్లా కనెక్షన్ ఉన్నప్పటికీ పనిచేయనట్లయితే కారణాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. అనంతరం ఎస్ఈ మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తాగునీటిని అందించాలని, నల్లాలు లేని వారికి త్వరలోనే నూతన కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఈఈ సుభాష్, డీఈ అజహర్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవోలు, ఏఈలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, డీఏవోలు పాల్గొన్నారు.

డీలర్లకు చట్టాలపై అవగాహన ఉండాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, జూన్ 7 : ఫర్టిలైజర్ డీలర్లకు విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్ఐ) కోర్సు పూర్తి చేసిన 40మంది ఎరువుల వ్యాపారులకు ఆయన సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఏఈఎస్ఐ కోర్సు పూర్తి చేసిన డీలర్లు రైతులకు పెట్టుబడి భారం తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని, పంటల్లో యాజమాన్య పద్ధతులను వివరించాలని సూచించారు. చీడ పీడలపై రైతులకు సలహాలివ్వాలని, మార్కెటింగ్, భూసార పరీక్షలు, సేంద్రియ వ్యవసాయంపై వివరించాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం విజయభాస్కర్, డీఏఈఎస్ఐ ఫెసిలిటేటర్ డీ నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

పాలెంవాగు ప్రాజెక్టు ప్రధాన కాల్వను పరిశీలించిన నర్సింహామూర్తి

కాల్వను పరిశీలిస్తున్న ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు

వెంకటాపురం(నూగూరు), జూన్ 7 : వానకాలం వస్తున్నా ముందస్తు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాలెంవాగు ప్రాజెక్టు అధికారులపై చర్యలు చేపట్టాలని ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొరుస నర్సింహామూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన రైతులతో కలిసి ఆరుగుంటపల్లి, జల్లకాలనీ మధ్య ఉన్న ప్రాజెక్టు ప్రధాన కాల్వను సందర్శించారు. దశాబ్దకాలంగా ప్రధాన కాల్వ పనులను ఇంత వరకు పూర్తి చేయలేదన్నారు. ఆరుగుంటపల్లి ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నదన్నారు. ప్రధాన రహదారి వద్ద కాల్వలో పోసిన మట్టిని తొలగించకపోవడంతో రైతులు నార్లు పోసుకునే పరిస్థితి లేదన్నారు. ప్రాజెక్టు పరిధిలోని రైతులకు సకాలంలో నీళ్లందించేదుకు అధికారులు చర్యలు తీసుకోవాలని నర్సింహమూర్తి కోరారు.

'మాదిగల కవాతును విజయవంతం చేయాలి'

కృష్ణకాలనీ/ములుగు రూరల్, జూన్ 7 : ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న వరంగల్‌లో నిర్వహించే మాదిగల కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ భూపాలపల్లి జిల్లా నాయకుడు అంబాల చంద్రమౌలి, ఎమ్మెస్పీ ములుగు జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మాదిగలంతా అధిక సంఖ్యలో తరలివచ్చి 30 ఏళ్ల పండుగను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 9న జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే కవాతులో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొనాలని చంద్రమౌలి కోరారు. సమావేశంలో నాయకులు నోముల శ్రీనివాస్, కేసారపు నరేశ్, దోర్నాల రాజేందర్, అంతడుపుల సురేశ్, మడిపెల్లి సుమన్, మంద తిరుపతి, మంతెన చిరంజీవి, ఓనపాకల కుమార్, కిశోర్, భద్రయ్య, శ్రావణ్, కిరణ్, నెమలి నర్సయ్య, మరాఠి రవీందర్, వావిలాల సాంబశివరావు, ఎంపెల్లి శంకర్, మల్లేశ్, లక్ష్మణ్, మహేశ్, శివ, రాంబాబు, రాజు, జాషువా, ములుగు జిల్లా అధికార ప్రతినిధి గజ్జెల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి'

ములుగు రూరల్, జూన్ 7 : ములుగు గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ విధి నిర్వహణలో మృతి చెందిన బల్గూరి సారయ్య కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మహాజన పారిశుధ్య కార్మికుల, ఉద్యోగుల సమాఖ్య వ్యవస్థాపక కోఆర్డినేటర్ నెమలి నర్సయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సారయ్య కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి మాట్లాడారు. పనిచేస్తున్న క్రమంలో ఇసుక లారీ కారణంగా మృతి చెందిన ఆయన కుటుంబంలోని ఒకరికి రెగ్యులర్ స్కేల్ వేతనంతో ఉద్యోగం కల్పించిఆదుకోవాలన్నారు. ఆయన వెంట దుస్సా సతీశ్, జీపీ కార్మికులు ఉన్నారు.

అసంపూర్తిగా అదనపు గదులు

- ఆశ్రమ పాఠశాలలో పూర్తికాని పనులు
- ఆరేళ్లుగా పట్టించుకోని అధికారులు

సగం వరకే గోడలు నిర్మించి ఉన్న గదులు

ఏటూరునాగారం, జూన్ 7 : మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. ఆరేళ్ల నుంచి పనులు పూర్తి కాకపోవడంతో మొండి గోడలే దర్శనమిస్తున్నాయి. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం ద్వారా రూ. 15 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. పాఠశాలలో గదుల కొరత ఉన్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఏటా మరమ్మతులు, అసంపూర్తి పనుల కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులు అవసరమైన ప్రతిపాదనలు అందిస్తున్నప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు. మొదటి అంతస్తులో నిర్మాణం చేపట్టేందుకు స్లాబు వేసి కొన్ని గదుల చుట్టూ ఇటుక గోడలు కొద్ది మేరకు నిర్మించి వదిలేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ శాఖ నుంచి ఏటా పాఠశాలల మరమ్మతుల పేరిట కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ ఈ గదులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయించడం లేదు. వర్షానికి తడిసి, ఎండకు ఎండి మొండి గోడలు దెబ్బతింటున్నాయి. ఐటీడీఏ కేంద్రంగా ఏటూరునాగారంలోనే అసంపూర్తి గదులు నిర్మాణానికి నోచుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కొంత నిధులు వెచ్చిస్తే సుమారు ఆరు గదులు వినియోగంలోకి వచ్చే అవకాశాలున్నాయి. ఐటీడీఏ అధికారులు నిధులు కేటాయించి అసంపూర్తి పనులు పూర్తి చేయించాలనని పలువురు కోరుతున్నారు.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య

గోవిందరావుపేట, జూన్ 7 : సర్కారు బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పస్రా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ అన్నారు. బడిబాటలో భాగంగా రెండో రోజైన శుక్రవారం మండల వ్యాప్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అందుతున్న సౌకర్యాలను శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో చాప బాబు, సక్రునాయక్, రాజు, సమ్మేశ్వర్‌రావు, రామరాజు, శేఖర్, నరేందర్, రాజయ్య, కనకయ్య పాల్గొన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి : మండల వ్యాప్తంగా శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల వివరాలను సేకరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. మండల నోడల్ ఆఫీసర్, జడ్పీహెచ్ఎస్ ఇందిరానగర్ ప్రధాన ఉపాధ్యాయుడు రేగ కేశవరావు, రేణుక, శాలిని, రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గోవిందరావుపేట : బడిబాట'లో పాల్గొన్న ఉపాధ్యాయులు

తాడ్వాయి : బడిబాటలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

10న రామప్ప భూముల కౌలు వేలం

వెంకటాపూర్, జూన్ 7 : వానకాలం పంట కోసం మండలంలోని రామప్ప దేవాలయం భూముల కౌలు వేలం పాటలు ఈ నెల 10న ఆలయ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఈవో బిల్లా శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవిందరావుపేట పరిధిలోని 10.14 ఎకరాల భూమికి రూ.50వేలు, బుద్దారం పరిధిలోని 27గుంటలు, రామంజాపూర్ పరిధిలోని 1.27 ఎకరాలకు రూ.5వేలు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఈవో పేర్కొన్నారు.

నేటి లోక్ అదాలత్‌కు ఏర్పాట్లు పూర్తి

ములుగు రూరల్, జూన్ 7 : జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం ములుగు కోర్టు ఆవరణలో నిర్వహించే లోక్ అదాలత్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎస్‌వీపీ సూర్యచంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 332 కేసుల్లోని కక్షిదారులకు నోటీసులు జారీ చేసి రాజీమార్గం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. మూడు బెంచ్‌లను ఏర్పాటు చేశామని, కక్షిదారులు న్యాయ సహాయం కోసం సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయసలహాలు, సూచనలు పొందవచ్చని చెప్పారు.

'నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాలి'

ములుగు రూరల్, జూన్ 7 : మెడికల్ కాలేజీలో ఉద్యోగ నియామకాలను నిబంధనల ప్రకారం చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. శుక్రవారం ములుగులో ఆయన మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో చేపట్టిన నియామకాల్లో మధ్యవర్తులతో లాలూచి విధానాలు కొనసాగిస్తే ఆందోళనలు, కోర్టులో న్యాయ పోరాటం చేస్తామన్నారు. ప్రస్తుతం ములుగు దవాఖానలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు మెడికల్ కాలేజీలో అవకాశం కల్పించాలన్నారు. రాజకీయ నాయకుల ప్రోద్బలంతో లేని మెరిట్‌ను ఉన్నట్లుగా చూపించి నియామకాలు చేపట్టే ప్రక్రియ కొనసాగుతున్నదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అవకతవకలు జరుగకుండా నియామకాలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

పిడుగు పడి దుక్కిటెద్దు, ఆవులు మృతి

పిడుగు పడి మృతి చెందిన ఆవులు

పలిమెల, జూన్ 7 : పిడుగు పడి ఏడు ఆవులు, రెండు లేగదూడలు, ఒక దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని ముకునూరు గ్రామ పరిధి బండారిగూడెంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రారంభమై ఒక్కసారిగా పిడుగు పడటంతో చెట్టు కింద ఉన్న అదే గ్రామంలోని రైతులు కోడె శంకరయ్య, ఆలం సుశీల, కోరం రజిత, కోడె నర్సయ్య, ఆలం హనుమయ్య, గణేశ్, మట్టి భీష్మణ్‌రావు, మట్టి మనోజ్, మట్టి కామేశ్, మట్టి కిశోర్‌కు చెందిన పది పశువులు మృతి చెందాయి. దీంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

వానలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్, జూన్ 7 : వానకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు, అధికారులు వానలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం ఆమె ములుగులో మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత వానకాలంలో అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు చెరువు, కుంటలను పరిశీలించి మరమ్మతు పనులకు అంచనాలు రూపొందిస్తే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. గత వానకాలంలో ముంపునకు గల కారణాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలను తీసుకోవాలని సూచించారు. మారేడుగొండ చెరువు కట్ట నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

లారీ ఓనర్లు, కార్మికుల సంక్షేమమే ధ్యేయం

భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్, జూన్ 7 : లారీ యజమానులు, కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం ది కాకతీయఖని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని భూపాలపల్లి పట్టణంలో నిర్వహించగా, ఆయన పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ కార్యాలయంలో కొబ్బరికాయ కొట్టి, నూతనంగా ఎన్నికైన ఐదుగురు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లారీల యజమానులకు ఎలాంటి కష్టం వచ్చినా వెన్నంటి ఉంటానన్నారు. భూపాలపల్లి మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి : డీఎంహెచ్‌వో

సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్

మహదేవపూర్, జూన్ 7 : రోగులకు మెరుగైన సేవలందించాలని జయశంకర్ భూపాలపల్లి డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్ వైద్యులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. దవాఖానలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి సేవలపై సమీక్షించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఆయన వెంట వైద్యులు రామారావు, విజయ్, సిబ్బంది ఉన్నారు.

తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు సాయం

బియ్యం, ఆర్థిక సాయం అందిస్తున్న చైర్మన్ శ్రీహరి బృందం

మంగపేట, జూన్ 7 : మండల కేంద్రంలో ఇటీవల తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు పిల్లలకు తన జన్మదినం సందర్భంగా ప్రజా సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుడివాడ శ్రీహరి రూ.2వేలతోపాటు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని పొదుమూరుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ యాకూబ్ ఇటీవల ప్రమాదంలో మృతి చెందడం, భర్త మృతిని తట్టుకోలేక భార్య రేష్మ కూడా ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఇలాంటి పిల్లలకు మానవత్వంతో సాయమందించాలని కోరారు. కార్యక్రమంలో గుండేటి రాజుయాదవ్, కరీం, ముప్పారావు సందీప్, సాధనపల్లి రవి, శ్రీను, యాకూబ్, గార అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నాలెడ్జ్ రీసెర్చ్ అకాడమీ ఎడిటర్‌గా రజిత

డాక్టర్ రజితను సన్మానిస్తున్న అధ్యాపకులు

మహదేవపూర్, జూన్ 7 : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ రజిత జాతీయ స్థాయిలో నాలెడ్జ్ రీసెర్చ్ అకాడమీ ఎడిటర్‌గా ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన పుస్తకంలో ఢిల్లీలోని టెక్ ప్రెస్ వారు ప్రచురించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రజితను శుక్రవారం కళాశాల అధ్యాపకులు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీ శ్రీనివాస్, వీ రమేశ్, డాక్టర్ రాజు, రమేశ్, రవీందర్, రాజేందర్, పరశురామ్, మున్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు దవాఖానలో జడ్పీ చైర్‌పర్సన్ ప్రసవం

రెండోసారి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన శ్రీహర్షిణి

పుట్టిన బిడ్డతో శ్రీహర్షిణి దంపతులు

భూపాలపల్లి రూరల్/కాటారం, జూన్ 7 : ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు పెంచేందుకు గత ప్రభుత్వం ఎన్నో మార్పులు తీసుకువచ్చింది. ఆడబిడ్డలకు ప్రైవేట్ దవాఖానల్లో కాన్పు భారం కాకూడదని కేసీఆర్ కిట్‌ను అందించింది. ఇందులో భాగంగా కాటారానికి చెందిన జయశంకర్ భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి తన తొలి కాన్పును సర్కారు దవాఖానలోనే చేయించుకొని అందరికీ ఆదర్శంగా నిలిచింది. రెండో కాన్పు కోసం తొమ్మిది నెలలుగా భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన ఆస్పత్రిలో చెకప్ చేయించుకుంటున్నారు. గురువారం రాత్రి పురుటి నొప్పులు రాగా సామాన్య మహిళగా దవాఖానకు వచ్చి టెస్టులు చేయించుకుంది. శుక్రవారం డాక్టర్లు ఆపరేషన్ చేయగా, పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో సామాన్య ప్రజలకు ప్రభుత్వ దవాఖానాలపై నమ్మకం పెరిగేలా చేసిందని జడ్పీ చైర్‌పర్సన్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.

క్రీడాకారులతో అధికారులు

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు

ములుగు రూరల్, జూన్ 7 : తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో రెండు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు ప్రతిభ చాటినట్లు క్రీడల ఇన్‌చార్జి అధికారి తుల రవి తెలిపారు. క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను శుక్రవారం ములుగులో ఆయన అభినందించారు. జిల్లాలో క్రీడలను ప్రోత్సహించేందుకు తమ శాఖ సిద్ధంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గెలుపొంది జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కోచ్ కుమారస్వామి, జూనియర్ అసిస్టెంట్ లావణ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

పేరూరులో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

వాజేడు, జూన్ 7 : మండలంలోని చెరుకూరు, పేరూరు, ధర్మవరం, చంద్రుపట్ల గ్రామాల్లోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి నర్సింహారావు ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఏవో హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఏటూరునాగారం ఏవో ఆర్ వేణుగోపాల్, ఏఈవోలు రాజు, హరీశ్, కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ప్రియాంక (ఫైల్)

గోవిందరావుపేట, జూన్ 7 : మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎట్టి ప్రియాంక అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై కమలాకర్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు గ్రామానికి చెందిన ఎట్టి సారయ్య చిన్న కుమార్తె ప్రియాంకకు పదేళ్లుగా మతిస్థిమితం సరిగా లేదు. ఈ నెల 6న తండ్రి పస్రాకు వెళ్లగా అతని కోసం ప్రియాంక కూడా ఎవరికీ చెప్పకుండా వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి అక్క ఎట్టి పుల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు 8712670086కు తెలుపాలని ఎస్సై సూచించారు.

టేకులగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై గొర్ల రమేశ్

'మావోయిస్టులకు సహకరించొద్దు'

వాజేడు, జూన్ 7 : మావోయిస్టులకు సహకరించొద్దని పేరూరు ఎస్సై గొర్ల రమేశ్ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని పేరూరు పోలీసు స్టేషన్ పరిధిలోని టేకులగూడెం గ్రామంలో శుక్రవారం సీఆర్పీఎఫ్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మావోయిస్టులు పరిసర ప్రాంతాల్లో సంచరిస్తే తమకు సమాచారమివ్వాలని సూచించారు.

'ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకటించాలి'

మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

కాటారం, జూన్ 7 : కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురయ్యే మండలంలోని గుండ్రాత్‌పల్లి, మల్లారం, గంగపురి గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకటించి పునరావాసం కల్పించాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం అన్నారం బరాజ్ సందర్శనకు వచ్చిన మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో రైతులు పంటలు నష్టపోతున్నారని, గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ముంపు బాధితులను ఆదుకోవాలి..

మహదేవపూర్ : బరాజ్ బ్యాక్ వాటర్‌తో పంట పొలాలు నీట మునుగుతున్నాయని, తమను ఆదుకోవాలని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సూరారం రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మేడిగడ్డ బరాజ్ సందర్శనకు వచ్చిన మంత్రికి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చల్లా రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. నాలుగేళ్లుగా బ్యాక్ వాటర్‌తో సుమారు 200 ఎకరాల్లో పోలాలు నీట మునుగుతున్నాయని, ప్రభుత్వం భూములను తీసుకొని మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని కోరారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

పంగ రమేశ్(ఫైల్)

భూపాలపల్లి రూరల్, జూన్ 7 : అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన భూపాలపల్లి పట్టణంలోని రాంనగర్‌కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. చుట్టు పక్కల వారు ఇచ్చిన సమాచారంతో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు నేతృత్వంలో చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్, ఎస్సై ప్రసాదరావు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీలో పంగ రమేశ్ (45) జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడని, మూడు రోజుల క్రితం ఆయన తన భార్య పిల్లలను వేరే గ్రామంలో వదిలిపెట్టి వచ్చి గురువారం ఉదయం విధులకు హాజరై సాయంత్రం ఇంటికి చేరుకున్నాడని తెలిపారు. శుక్రవారం ఉదయం రమేశ్ ఇంటిలోకి కోతులు వెళ్లడాన్ని చూసిన ఓ వృద్ధురాలు చుట్టు పక్కల వారికి చెప్పిందన్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో వారు ఇంట్లోకి వెళ్లి చూడగా బాత్రూంలో రమేశ్ మృతి చెంది